క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



కలశ స్థాపన చేస్తున్న వేద పండితులు

రాజుపాళెం : గోపాయలపల్లె గ్రామంలో పునర్నిర్మించిన రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, కలశస్థాపన, మహా మంగళహారతి, అగ్ని ప్రతిష్ఠాపన, జలాది వాసం, జపములు తదితర పూజా కార్యక్రమాలను కైపా ఆనందకుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు, మంగళహారతి స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నియామకం



విజయలక్ష్మి

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీశంకరాచార్య హైస్కూల్, శ్రీఆదర్శ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మూలె విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఏపీపీఎస్ఏ రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశంలో మూలె విజయలక్ష్మిని మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు తెలిపారు.

పోలీసుల తనిఖీలు



చెన్నుపల్లెలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కలసపాడు : మండలంలోని చెన్నుపల్లెలో పోరుమామిళ్ళ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాలు, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేశారు. కలసపాడు ఎస్ఐ తిమోతి, పోరుమామిళ్ళ ఎస్ఐ కొండారెడ్డి, కాశినాయన ఎస్ఐ హనుమంతు ప్రజలకు కార్డెన్‌సెర్చ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా మారణాయుధాలు, పేలుడు పదార్థాలు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ళ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల విద్యార్థులకు పురస్కారం



మాట్లాడుతున్న గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో రాణించిన గాండ్ల తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు అఖిలభారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని అఖిలభారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో 500 మార్కులు పైన, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అన్ని గ్రూపుల్లో 900 పైగా మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. మే 18న తమ కార్యాలయంలో పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. అలాగే 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామని వివరించారు. మే 15లోపల అర్హులైన విద్యార్థులు గాండ్ల కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9398674595, 9440123661 నంబర్లకు సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ జీసీ పుల్లయ్య, గౌరవాధ్యక్షుడు కుర్రా కృష్ణయ్య, కార్యదర్శి నల్లం శివశంకర్, సభ్యులు చిన్నసుబ్బయ్య, బచ్చల శ్రీనివాసులు, జీవన్‌ప్రసాద్, నాగేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు మరమ్మతులు చేయండి



గుంతలు పడిన బైపాస్ రోడ్డు

ప్రొద్దుటూరు : స్థానిక సినీ హబ్ బైపాస్ రోడ్డులో మరమ్మతులు చేసి వెంటనే గుంతలను పూడ్చాలని మోడంపల్లె, రాజేశ్వరి కాలనీ, గ్రీన్ ల్యాండ్ కాలనీ వాసులు కోరుతున్నారు. మే 4వ తేదీన మోడంపల్లెలో యల్లమ్మ తల్లి దేవర ఉత్సవం భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖులతోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మోడంపల్లె పక్కనే ఉన్న బైపాస్ రోడ్డు గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. దాదాపు రెండేళ్లుగా వాసవి సర్కిల్ నుంచి రిలయన్స్ పెట్రోలు బంకు వరకు బైపాస్ రోడ్డు వెంబడి గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

‘బోరు’మంటున్న భూగర్భం

- విచ్చలవిడిగా బోరుబావుల తవ్వకాలు
- భూగర్భ జలాన్ని తోడేస్తున్న వైనం
- పోరుమామిళ్ల, బద్వేలు మండలాల్లో ప్రమాద ఘంటికలు

బద్వేలు : బద్వేలు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణంలో 40 శాతానికి పైగా భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉందని భూగర్భ జలశాఖ సర్వేలో తేలింది. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు తదితర కరువు మండలాల్లో భూ ఉపరి తలానికి వందల అడుగుల లోతులో బోర్లు వేసినా చుక్కనీరు రావడం లేదు. వేల సంఖ్యలో బోర్లు వేసి భూగర్భ జలాన్ని అంతా తోడేశారు. దీంతో భూగర్భంలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటాయి.

వాల్టా చట్టం బోల్తా

నీటిని అవసరానికి మించి వాడుతుండటం, అనుమతి లేకుండా ఇష్టారీతిన బోరు బావుల తవ్వకాలు జరపడం వంటివి భవిష్యత్ తరాలకు ప్రమాదమని భావించిన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002లో.. వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్ (వాల్టా) (నీరు, భూమి, వృక్షాల సంరక్షణ చట్టం) అనే ప్రత్యేక చట్టాన్ని తీసుకు వచ్చింది. ఈ చట్టం బోరు బావులకు సంబంధించిన అనేక నిబంధనలు తయారు చేసింది. ఎవరైనా బోరు వేయాలన్నా.. బావులు తవ్వాలన్నా.. చెట్లు నరకాలన్నా.. ఇసుక తోడాలన్నా.. ఇలా చాలా అంశాల నుంచి ముందుగా ప్రభుత్వం నుంచి నిర్దేశిత అనుమతులు తీసుకోవాలి. సర్వే నంబర్ ఆధారంగా రెవెన్యూ సిబ్బంది బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. తదుపరి దరఖాస్తు భూగర్భ జల వనరుల శాఖకు పంపుతారు. అక్కడ టెక్నికల్ అధికారి సర్వే చేసి ఆ ప్రాంతంలో నీరు పడతాయని ధ్రువీకరిస్తే.. అప్పుడు బోరు వేసుకోవడానికి అనుమతి ఇస్తారు.



కాశినాయన మండలం అక్కెంగుండ్లలో నీరు పడకపోవడంతో వదిలేసిన బోరుబావి

100 మీటర్ల నుంచి 500 మీటర్ల దూరంలో బోరు బావి ఉంటే మరో బోరుకు అనుమతి ఇవ్వరు. కానీ ఇప్పుడు అవి ఏవీ లేవు. వాల్టా చట్టం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు వాల్టా చట్టం ఒకటుందనేది చాలా మంది అధికారులకే తెలియదు. విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ బోరు బావులు తవ్వేస్తున్నారు. నీళ్లు తోడేస్తున్నారు. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో వాల్టా చట్టం బోల్తా కొట్టింది.



కాశినాయన మండలం అకులనారాయణ పల్లెలో చుక్కనీరు పడని బోరుబావి

అడుగంటిన భూగర్భ జలాలు

గ్రామాల్లో విచ్చలవిడిగా బోర్లు వేసి నీరు తోడేస్తుండటంతో భూగర్భ జలాలకు పెనుముప్పుగా మారాయి. నియోజకవర్గంలో 12 వేలకు బోరుబావులు చేరువైనట్లు తెలుస్తోంది. జనవరిలో భూఉపరితలానికి 15.05 మీటర్ల దిగువనున్న భూగర్భం నీటి మట్టం ఏప్రిల్ నాటికి 25 మీటర్ల దిగువకు పడిపోయింది. గత ఏడాది జూన్ నెలలో 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 15 మిల్లీ మీటర్లు వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటేందుకు కారణమైంది.

పెరిగిన వినియోగం

వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగాన్ని బట్టి భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేస్తారు. 70 శాతం లోపు వినియోగముంటే ఆ ప్రాంతంలో భూగర్భజలాల పరిస్థితి సురక్షితంగా ఉన్నట్లే. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి సురక్షితంగానే ఉంది. 70–80 శాతం మధ్య వినియోగం ఉన్న కలసపాడు, బి.కోడూరు తదితర మండలాల్లో పరిస్థితి స్వల్ప ప్రమాదకర పరిస్థితిలో ఉందని గుర్తించారు. 90–100 శాతం మించి వినియోగమున్న పోరుమామిళ్ల, బద్వేలు మండలాల్లో భూగర్భ జలాలు అతి ప్రమాదకర పరిస్థితికి చేరాయి. భూగర్భ జలాల అభివృద్ధికి వాటర్ షెడ్లు, చెక్‌డ్యాంలు, కుంటలు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు సద్వినియోగం కావడం లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న ఈ పనుల్లో అవినీతి, అక్రమాలు హద్దులు దాటుతున్నాయి.

ప్రమాద ఘంటికలు

వర్షపాతం తక్కువగా ఉండే కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. సాధారణంగా భూ ఉపరితలానికి 10 నుంచి 15 మీటర్ల లోతులో నీళ్లు ఉంటాయి. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో 50 మీటర్ల దిగువకు తవ్వినా నీటి తడులు లభించడం లేదు. 30 మీటర్లకు మించితే ఆ ప్రాంతంలో భూగర్భ జలాల పరిస్థితి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

తొమ్మిది బోర్లు వేశా



మాకు వ్యవసాయమే జీవనాధారం. పొద్దున లేస్తే పొలం పోయి, పైర్లు చూసుకోవాలి. పంటలు పండించుకోవాలంటే మాకు బోర్లు తప్ప మరో మార్గం లేదు. అందుకే తొమ్మిది బోర్లు వేశా. అందులో ఆరు బోర్లు ఒట్టిపోయాయి. మిగిలిన బోర్లలో నీరు లేదు. ఇప్పుడు ఒక బోరు మాత్రమే పని చేస్తుంది. బోర్లకే దాదాపు మూడు లక్షల రూపాయాలు ఖర్చు అయ్యాయి.

– డి.తిరుమలరెడ్డి, రైతు, మహానందిపల్లె, కలసపాడు మండలం

మూడు లక్షలు నష్టం



పైర్లు కాపాడుకోవడానికి ఐదెకరాల పొలంలో నాలుగు బోర్లు వేశాను. చుక్కనీరు పడలేదు. బోర్లు వేసేందుకు మూడు లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయి. ఏమాత్రం లాభం లేదు. అప్పులు మిగిలినవి. పంటలు ఎండిపోయినయి. ఏమి దిక్కుతోచడం లేదు. ప్రభుత్వ పరంగా సాయం అందుతుందన్న భరోసా కూడా లేదు.

– పి.సుబ్బారెడ్డి, రైతు, యం.యస్.పురం, బి.కోడూరు మండలం

ఇద్దరు బాలురు అదృశ్యం



వెంకటదర్శన్, లక్ష్మణ్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్న అన్నదమ్ముల పిల్లలు ఇద్దరు అదృశ్యమయ్యారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు సంబటూరు వెంకటరమణ ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకటదర్శన్ ఇటీవల వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఉన్న రూ.500 కనిపించలేదని తండ్రి వెంకటదర్శన్‌ను మందలించడంతో అతను అదే వీధిలో ఉంటున్న తన తమ్ముని ఇంటికి వెళ్లాడు. తన తమ్ముని కుమారుడు సంబటూరు లక్ష్మణ్‌తో కలిసి అక్కడే కొద్దిసేపు ఆడుకున్నాడు. కొంత సేపటి తర్వాత ఇరువురు బాలురు కనిపించలేదు. ఇరువురి తల్లిదండ్రులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఇరువురు పిల్లలు కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

గోపవరం : మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. గత మూడు నెలలుగా మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా, మరో మూడు నెలల వ్యవధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎలాంటి ప్రణాళిక కూడా అధికారుల వద్ద లేకపోవడంతో సమావేశాన్ని మమ అనిపించారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల వ్యవధిలో అక్కడక్కడా సీసీ రోడ్లు మినహా ఏ ఇతర అభివృద్ధి పనులు కూడా జరిగిన దాఖలాలు లేవు. ఉదయం 11–30 గంటలకు ప్రారంభమై కేవలం గంట వ్యవధిలోనే ముగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో ఏడు గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్‌లు ఎవరూ కూడా ఈ సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు లేవనెత్తిన సమస్యలపై ఎలాంటి స్పందన లేకపోవడంతో గైర్హాజరైనట్లు కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కాలువపల్లె, గోపవరం, రాచాయపేట గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఎంపీటీసీలు రాజేశ్వరి, భాగ్యమ్మలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి, ఎంపీటీసీలు రామ్మోహన్‌రెడ్డి, భాగ్యమ్మ, రాజేశ్వరి, ఈఓపీఆర్‌డీ హసీనా, మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, పశువైద్యాధికారి శిరీష, ఏపీఓ విజయమ్మ, ఏపీఎం ప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష




మైదుకూరు : రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కమిటీ నాయకులు మాట్లాడుతూ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు నిరహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో డ్రైవర్లు ఎంపీ రావు, ఎస్ఎం ఆలీ, టీఎస్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. రెండు రోజుల దీక్షలో మొదటి రోజు డిపోకు చెందిన కండక్టర్లు ఎన్.శ్రావణ్, యు.శివయ్య దీక్షకు కూర్చున్నారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఎస్ రాయుడు, యూనియన్ గ్యారేజీ కార్యదర్శి వైఎస్ రాయుడు, అధ్యక్షుడు నాగరాజు, పి.శ్రీను, వినోద్‌కుమార్, సుబ్బారెడ్డి, ఆర్.బాబు, జీఎస్ రెడ్డి, జీఆర్ రెడ్డి, ఎన్ఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అసోసియేషన్ డిపో సెక్రటరీ చంద్రయ్య, గ్యారేజీ సెక్రటరీ నాగేంద్ర, అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నపరెడ్డి, సీసీఎస్ డెలిగేట్ మల్లికార్జున, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు పి.ఎస్.వాసులు, అబ్రహాం, ఫయామ్, గంగాధర్, ఎం.ఎస్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సంస్కారం అవసరం



వేడుకలో పాల్గొన్న పీఠాధిపతి, ప్రజాప్రతినిధులు

చాపాడు : సంస్కారవంతమైన విద్యను అందించకపోవడం, వారి తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహించకపోవడం వల్లనే పహల్గాంలో దారుణానికి కారణమైన క్రూర మనస్తత్వం గల యువకులు తయారు అయ్యారని అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల వికాస కేంద్రాల వార్షికోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కారవంతమైన విద్య అందించేందుకు సమరసత సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన బాల వికాస కేంద్రాలు తోడ్పాటువుతాయన్నారు. ఈ కార్యక్రమంలో 13 కేంద్రాల నుంచి 274 మంది విద్యార్థులు, 100 మంది పిల్లల తల్లిదండ్రులు, మరో 500 మంది పెద్దలు హాజరయ్యారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వీరనారాయణ యాదవ్, మండపం ప్రెసిడెంటు దొంతు సుబ్రమణ్యం, మండల కన్వీనర్ సుబ్బరాయుడు, నాగేశ్వరరెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ప్రత్యేక బృందం ఏర్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఆక్రమణదారుల చిట్టాను తెలుసుకొనేందుకు కలెక్టర్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం బి.మఠం తహసీల్దార్ కార్యాలయంలో ఆక్రమణల ప్రత్యేక బృందం స్పెషల్ ఆఫీసర్ శిరీష, బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దార్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 7600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా 15 వేల ఎకరాలకు గతంలో ఉన్న తహసీల్దార్లు, వీఆర్ఓలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేసినట్లు తెలుస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా ఆక్రమణదారులు ఎంతటి వారైనా వారి భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. వ్యవసాయ భూములు లేని నిరుపేదలకు పంచడం జరుగుతుందన్నారు. బి.మఠం మండలం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరి సహకారం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నవోదయం పాఠశాలకు 30 ఎకరాలు భూమిని ఎద్దులాయపల్లె దగ్గర ఉన్న సబ్‌స్టేషన్ ఎదురుగా గుర్తించడం జరిగిందన్నారు. అలాగే తోట్లపల్లె దగ్గర ఉన్న గురుకుల పాఠశాలలో ఇంకా మిగులు పనులు ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేయించి పిల్లలకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. అనంతరం బి.మఠంలో జరిగిన అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ జాన్స్, సర్వేయర్లు, నాయకులు సుబ్బారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, పోలిరెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు



మాట్లాడుతున్న డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు : గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు తెలిపారు. సోమవారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. శ్రీరమణమహర్షి హైస్కూల్ హెచ్ఎం రవిప్రకాష్, స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ రమ్‌తుబేగం, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు గోపినాథ్‌రెడ్డి, జిరాఫీ చెస్ డైరెక్టర్, ఆర్‌సీపీఈ గ్రంథాలయ అధికారి గంగాధర్‌రెడ్డి యోగా మాస్టర్ వెంకట రామిరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు చాడా మునిరెడ్డి, గ్రంథాలయాధికారి టి.తిరుపతమ్మ, హెల్పర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

చాపాడు : వేసవి సెలవుల్లో నిర్వహించే విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానకిరామ్, నక్కలదిన్నె బీడీఎస్ రవిశంకర్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : అట్లూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమైనట్లు గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజులు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

చెట్ల కొట్టివేత.. అడ్డుకున్న అధికారులు

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో సోమవారం వాల్టా చట్టానికి తూట్లు పొడిచారు. గ్రామ సమీపంలోని హిందూ స్మశాన వాటికలో పెద్ద చెట్లను నరికేస్తున్నప్పటికీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు గ్రామంలోని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని స్మశాన వాటికలో పెద్ద పెద్ద బిర్షనపు జాతికి చెందిన మూడు చెట్లు ఉన్నాయి. వీటిని గ్రామంలోని కొందరు వ్యక్తులు.. వ్యాపారులతో మాట్లాడుకుని రూ.28,000కు విక్రయించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ మూడు పెద్ద చెట్లను యంత్రాల సహాయంతో నరికేసి మొద్దులుగా చేసి ట్రాక్టర్‌లో లోడు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ తీరు నచ్చని కొందరు వ్యక్తులు చెట్లు నరికివేతపై తహసీల్దారు రమాకుమారికి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన తహసీల్దారు తమ సిబ్బందిని పంపించి చెట్ల మొద్దులు తరలిపోకుండా అడ్డుకున్నారు. గ్రామంలో రెవెన్యూ, ఇతర ప్రభుత్వ యంత్రాంగ సిబ్బంది ఉన్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకోకపోవడం, స్థానిక ప్రజలే ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవడం గమనార్హం. ఈ చెట్ల కొట్టివేతపై గ్రామ పెద్దలు శ్మశాన వాటిక అభివృద్ధి కోసమే వీటిని కొట్టించేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం మేరకు 2025–26 సంవత్సరానికి గాను ఉచిత విద్యకోసం విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సావిత్రమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి 5 ఏళ్లు పూర్తయిన చిన్నారులు 1వ తరగతిలో ప్రవేశానికి మే 2 నుంచి మే 19 లోపు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని వివరించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఎంఈఓ కార్యాలయం, సచివాలయం, ఇంటర్‌నెట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మే 2 నుంచి స్వీకరణ

చాపాడు : మే నెల 2 నుంచి 19వ తేది వరకూ మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించనున్న 25 శాతం ఉచిత సీట్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. ఈ నెల 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం మే 2వ తేదీకి మార్పు చేసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే 20 నుంచి 24 వరకూ ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారని, లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను 29న విడుదల చేస్తారని, జూన్ 8న ప్రవేశాల నిర్ధారణ చేస్తారని, జూన్ 11న రెండో విడత ఫలితాలను విడుదల చేసి 18న ఖరారులు చేస్తారన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

బద్వేలు అర్బన్ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి దుర్మార్గమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, సీనియర్ న్యాయవాది డి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు నుంచి సిద్దవటం రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మురళీకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఈ.సి.ఓబుల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ప్రదీప్‌కుమార్‌పవార్, న్యాయవాదులు సూర్యనారాయణరెడ్డి, సురేష్‌బాబు, శ్రీధర్‌నాయుడు, భాస్కర్, దామోదర్, రమణారెడ్డి, శ్రీనివాసులు, విజయకుమార్, రాజ్‌కుమార్, ప్రవీణ్, రేవంత్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న విరజానందస్వామి

బద్వేలు అర్బన్ : సమాజాభివృద్ధి, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా ఉండాలని అచలానంద ఆశ్రమ పీఠాధిపతి స్వామివిరజానంద పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిపల్లె వద్ద గల విశ్వశాంతి విద్యానికేతన్ పాఠశాలలో 5 రోజులుగా జరుగుతున్న రాష్ట్ర సేవికా సమితి శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ మహిళా సంస్కృతి, సంప్రదాయాన్ని నిలబెట్టడానికి రాష్ట్ర సేవికా సమితి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రతి మహిళ హిందూ జీవన విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని, నవభారత నిర్మాణం కోసం ముందుకు రావాలని కోరారు. అనంతరం నందిపల్లె గ్రామంలో మహిళలతో పద సంచలనం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి జిల్లా కార్యవాహ్ మాధవి, బద్వేలు కార్యవాహ్‌లు ధనలక్ష్మి, కవిత, ఆర్ఎస్ఎస్ ఖండ సంచాలక్ రామకోటిరాజు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు అంకయ్య, నాయకులు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బద్దెన కళాపీఠం అధ్యక్షుడు సాంబశివారెడ్డి, సరస్వతి విద్యామందిర్ కార్యదర్శి సుధాకర్, వీహెచ్‌పీ నాయకులు పెరుగువెంకటయ్య, పి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

కాశినాయన : నరసాపురం గ్రామానికి చెందిన గోసెలసుబ్బమ్మ అనే మహిళ పూసలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. 5 ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది. షుగర్ ఎక్కువై కాలు పూర్తిగా దెబ్బతినడంతో జీవనాధారం కోల్పోయింది. విషయం తెలుసుకున్న మూలపల్లె ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆమె వద్దకు వెళ్లారు. ఇది వరకే ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, బట్టలు, రూ.5 వేల నగదును అందజేశారు. ఇటీవల సుబ్బమ్మకు మరుగుదొడ్డి లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ప్రధానోపాధ్యాయుడు రూ.30 వేలు తన సొంత నగదుతో మరుగుదొడ్డిని నిర్మించి మానవత్వం చాటుకున్నారు. సుబ్బమ్మ కుటుంబ సభ్యులు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్పందన సుబ్బరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన ప్రసాద సేవ నిర్వహించారు. సుమారు 600 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మూరుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవాలయం సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలతోపాటు పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద గల భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సమరసత సేవా సంస్థ ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.